క్లుప్తంగా

ఎర్రగట్టు మైసమ్మకు పూజలు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు సమీపంలో ఉన్న ఎర్రగట్టు మైసమ్మను ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు సమర్పించారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. అజ్జకొలు, తిరుమలాయపల్లి, రామన్‌పాడు, మదనాపురం తదితర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ కమిటీ వారు తాగునీటి వసతి, విడిది సత్రాలు ఏర్పాటు చేశారు.

శ్రీరంగాపురం ఎస్‌ఐకి సన్మానం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణను ఆదివారం కాంగ్రెస్ మండల నాయకుడు బీరం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడుతానని, ఎంటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, కురుమన్న, వెంకటయ్యనాయుడు, వెంకటయ్య, పలుస రాజుగౌడ్, మేకల వెంకటయ్య, గోవిందు, రాములు, మల్లేష్‌యాదవ్, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు..



పాన్‌గల్: మండల నూతన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులను తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) ఆధ్వర్యంలో ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలో విద్యాభివృద్ధి చేసేందుకు సంఘాల సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. దీంతో పాటు ఖిల్లాఘనపురం ఎంఈఓ జయశంకర్, పెద్దమందడి ఎంఈఓ విష్ణును కూడా సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కృష్ణయ్య, వెంకటేష్, బాలస్వామి, చెన్నప్ప, ప్రకాష్ పాల్గొన్నారు.

'ఆరెకటిక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయండి'

వీపనగండ్ల: చర్మాలను శుభ్రం చేసే వృత్తిని ఎంపిక చేసుకుని దుర్భర జీవితాలను గడుపుతున్న ఆరెకటికలను ఆదుకునేందుకు ఆరెకటికె ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని మండల ఆరెకటిక సంఘం నాయకులు శంకర్‌జీ, బాలాజీ, వెంకట్రావు, శ్రీనివాసులు, శివాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొన్ని రాష్ట్రాల్లో తమ కులస్తులు ఎస్సీ, బీసీ ఏ గ్రూపులో ఉన్నారని, తెలంగాణలో మాత్రం తమను బీసీ డీ గ్రూపులో చేర్చడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమకు అవసరమైన ఆర్థికసాయం అందించాలని వారు కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మిక ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశ రాము ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్నాలో మున్సిపల్, పంచాయతీ కార్మికులు, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల కార్మికులు, పరిశ్రమల్లో, రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



పాన్‌గల్: అంబులెన్స్‌లోనే గర్భిణి ప్రసవించిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గర్భిణి శిరీషకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో గర్భిణిని జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. అప్రమత్తమైన సిబ్బంది అంబులెన్స్‌లో ప్రసవం చేయగా.. ఆడబిడ్డకు జన్మనిచ్చిందని ఈఎంటీ శశికుమార్, పైలెట్ మహేష్ తెలిపారు. తల్లి, బిడ్డను జిల్లా ఎంసీహెచ్ ఆస్పత్రిలో చేర్పించినట్లు వారు పేర్కొన్నారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు.

చెరువా.. సబ్‌స్టేషనా?

- చిన్న వర్షానికే నీరు నిలుస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



నిల్వ నీటిలోనే లైన్ మార్చుతున్న ఆపరేటర్ (ఫైల్)



ఉప్పరిపల్లి లో వర్షపు నీటిలో విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లిలో ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చిన్నపాటి వర్షం కురిస్తేచాలు నీరు సబ్‌స్టేషన్‌లోకి చేరి కుంటను తలపిస్తుంది. గ్రామంలో నుంచి వచ్చే వర్షపు నీరు నేరుగా సబ్‌స్టేషన్‌లోకే వస్తుంది. మెండికుంట పాటుకాల్వ పక్కనే ఉండటంతో కుంటలో కొద్దిగా నీరు ఎక్కువ అయితే సబ్‌స్టేషన్ పూర్తిగా నీటిలో మునిగిపోతుంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఉప్పరిపల్లి, సూరాయపల్లి, జగ్గాయపల్లి గ్రామాల్లోని 633 వ్యవసాయ బోర్ల కనెక్షన్లు, 890 గృహ అవసరాల మీటర్లు ఉన్నాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

అరచేతిలో సిబ్బంది ప్రాణాలు..

వర్షం కురిసిందంటే చాలు నీరు గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్‌లోకి చేరుతుండడంతో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. నడుముల వరకు నీటిలో భయపడుతూనే కర్రల సహాయంతో వెళ్లి లైన్ మార్చడం, ఆన్‌ఆఫ్ చేయడం చేస్తున్నారు. ఎప్పుడు విద్యుదాఘాతంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వర్షపు నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం ..

ఉప్పరిపల్లిలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌లోకి వర్షపు నీరు వస్తున్నాయని అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల సహకారంతో త్వరిత గతిన సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– కొండయ్య, ట్రాన్స్‌కో ఏఈ, ఖిల్లాఘనపురం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

వనపర్తి రూరల్: ఎపీఆర్టీయూ టీఎస్ ఎన్నికల అధికారి ఎస్ రామచంద్రుడు ఆధ్వర్యంలో ఆదివారం పెబ్బేరు మండల పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్ పాల్గొన్నారు. అధ్యక్షుడిగా దాసరి చిన్న రాములు, ప్రధాన కార్యదర్శిగా బొల్లరి దుర్గాప్రసాద్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులకు సేవ చేయడం కోసం నావంతు కృషి చేస్తానని, ఉపాధ్యాయుల శ్రేయస్సు, వారి సమస్యలపై ఎటువంటి పోరాటానికైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ సంఘ సభ్యులు దయానంద్, కృష్ణయ్యగౌడ్, రాజు, శివశంకర్, విష్ణువర్ధన్‌నాయుడు, శ్రీనివాసులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: పీఆర్‌టీయూ టీఎస్ మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వరనాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ ఆంజనేయులు, అసోసియేట్ అధ్యక్షుడిగా సురేష్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, గౌరవ అధ్యక్షులుగా మాదేవ్‌గౌడ్, మండల సెక్రెటరీగా రాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భక్తరాజు, ఎన్నికల పరిశీలకులు రామచంద్ర, జిల్లా అధ్యక్షుడు వరప్రసాదరావు, సూర్యచంద్రశేఖర్, కదిరి లక్ష్మయ్య, సూర సత్యనారాయణ, పాల్గొన్నారు.

చిరుత సంచారం

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లి సమీపంలోని బోడగుట్ట దగ్గర ఆదివారం ఉదయం, అప్పారెడ్డిపల్లి శివారులో రాత్రి 8గంటల సమయంలో చిరుత పులి సంచరించడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఇదే గుట్టపై రెండు చిరుత పులులు కనిపించాయి. కొన్ని రోజులకు కర్నెతండా వైపు ఉన్న అడవుల్లోకి వెళ్లినట్లు ప్రచారం జరిగింది. ఆదివారం మరోసారి గుట్టపై కనిపించడంతో గుట్ట పక్కన బీటీ రోడ్డు వెళ్లడానికి ప్రయాణికులు భయపడుతున్నారు. గుట్టచుట్టు మల్కిమియాన్‌పల్లి, వసురాంతండా, సూర్యతండా, దేవబండతండా, హీర్లతండా, నేలబండ తండా, అల్లమాయపల్లి తదితర గ్రామాలున్నాయి. చిరుత సంచరిస్తున్నట్లు తెలియడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చిరుతను పట్టుకుని అడవులకు తీసుకెళ్లాలని కోరుతున్నారు.

పరిసరాల్లో నీటి నిల్వలు తొలగించాలి



పాన్‌గల్: పరిసరాలల్లో నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తాయని, దీంతో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పీహెచ్‌సీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిసరాల్లోని ఎయిర్ కూలర్లు, కొబ్బరి చిప్పలు, పాత వాటర్ బాటిల్స్, బకెట్లు, టైర్లు, కుండల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. ఇంటి అవరణలోని నీటి నిల్వలోనే దోమలు వృద్ధి చెందడంతో ప్రమాదకర డెంగీ బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామాల్లో అధికారులు పర్యటించే సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు

సింహగర్జన సభను జయప్రదం చేయండి

వనపర్తి రూరల్: జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మద్దిలేటి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చిట్యాల, కడుకుంట్ల గ్రామస్థాయి మాల మహానాడు నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. చిట్యాల గ్రామ అధ్యక్షుడిగా చిన్న దాసు, ప్రధాన కార్యదర్శిగా బర్కం రమేష్, ఉపాధ్యక్షులు పెద్దదాసు, శాంతయ్య, కార్యదర్శులుగా శేఖర్, ఆంజనేయులు, కడుకుంట్ల గ్రామ అధ్యక్షుడిగా జెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి దాసరి కురుమూర్తి, ఉపాధ్యక్షులుగా బిజ్జ శేఖర్, దాసరి సురేందర్, కార్యదర్శులు దాసరి వెంకటేష్, జెట్టి నరసింహతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ అక్టోబర్ 27న నాగర్‌కర్నూల్‌లో జరిగే మాల సింహగర్జన సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యం



దుకాణదారుడికి బీజేపీ సభ్యత్వం అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

రాజోళి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీదే హవా కొనసాగుతుందని.. ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి అన్నారు. ఆదివారం రాజోళిలో మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరుగుతూ పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్నారు. పార్టీలో ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారని, రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగుతుందని అన్నారు. గ్రామాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పథకాలపై, ఆయన చేస్తున్న అవినీతి రహిత పాలనపై ప్రజలు మంత్ర ముగ్ధులయ్యారని అన్నారు. గతంలో పాలించిన బీఆర్ఎస్ పార్టీ, ప్రస్తుతం పాలిస్తున్న కాంగ్రెస్‌తో ప్రజలు విసిగిపోయారని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి పేదల కడుపు కొడుతుందని అన్నారు. పథకాల పేరుతో రైతులను, మధ్యతరగతి కుటుంబాలను నిలువునా ముంచిన రేవంత్ సర్కారుకు కాలం చెల్లిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అడివిస్వామి, శశికుమార్, ఈసీ అంజనేయులు, గోవిందురాజులు, భాస్కర్ రెడ్డి, చిన్నప్ప, నారాయణ చంద్రకాంత్, లక్ష్మణ్ గౌడ్, బసోది వీరన్న తదిదరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లికి చెందిన ఉమాశంకర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 9, 10, 11 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా హ్యాండ్ బాల్ జట్టులో పాల్గొంటారని ఆయన తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

వీపనగండ్ల: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో ప్రమాదకరమైన మలుపులు ఉండడం, వాటికి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. తూంకుంట నుంచి వల్లభాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో ప్రధాన మలుపు ఉండి ప్రమాదం పొంచి ఉంది. అలాగే మండల కేంద్రం నుంచి కల్వరాల, తూంకుంట, సంపత్‌రావుపల్లి, బొల్లారం చౌరస్తా నుంచి కొర్లకుంట గ్రామాల మధ్య పలు చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉండి రోడ్డు గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తూంకుంట, వల్లభాపురం గ్రామాల మధ్య ప్రమాదకర మలుపు

అవోపా జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



ఆత్మకూర్: అవోపా వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూర్‌కు చెందిన దోమ శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని వాసవీ భవన్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. ఆత్మకూర్‌కు చెందిన శ్రీనివాస్‌కు జిల్లా అవోపా పదవి రావడంపై ఆర్య వైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, నాగరాజు, ప్రవీణ్‌కుమార్, శివరాజ్, జగదీష్ తదితరులు హర్షం ప్రకటించారు.

కాల్వల రోడ్ల మరమ్మతు చేయించండి



నాగర్లబండ క్రాస్ రోడ్డు నుంచి సంగినేనిపల్లికి వెళ్లే భీమా కాలువ ప్రధాన రోడ్డు

వీపనగండ్ల: మండలంలోని భీమా, జూరాల, కేఎల్‌ఐ కాల్వల ఆయకట్టు పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రధాన, మైనర్, సబ్‌మైనర్ కాల్వల రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వాటికి వెంటనే మరమ్మతు చేయించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు. జూరాల కాల్వల ద్వారా గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, రంగవరం, సంపత్‌రావుపల్లి, వీపనగండ్ల గ్రామాలకు సాగునీరు అందుతుంది. భీమా కాల్వ ద్వారా పుల్గర్‌చర్ల, కల్వరాల, సంగినేనిపల్లి, తూంకుంట గ్రామాల రైతులకు సాగు నీరు అందుతుండగా.. అన్ని గ్రామాల్లోని పంట పొలాలకు వెళ్లే రహదారులు పూర్తిగా పాడైనా.. వాటి మరమ్మతు కోసం అధికారులు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

బాతు.. బొప్పాయి



ఆత్మకూర్: బాతు, హంస ఆకారంలో ఉన్న బొప్పాయి పట్టణంలో పలువురిని ఆకర్షించింది. ఆదివారం ఆత్మకూర్‌లో సంత కావడంతో పండ్లు అమ్ముకునే ఓ మహిళతో బొప్పాయిలను కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు బాతు ఆకారంలో ఉన్న బొప్పాయి పండును ఆసక్తిగా గమనించారు.

సబ్సిడీ సిలిండర్ల ప్రొసీడింగ్స్ అందజేత



ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు రూ.500కే సిలిండర్ ప్రొసీడింగ్స్ పత్రాలను ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందదర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీనివాసులు, గొల్లబాబు, ఎజాజ్ అలీ, లక్ష్మయ్య యాదవ్, మహేశ్వర్‌రెడ్డి, సాయిరాం, చంద్రశేఖర్‌యాదవ్, బాబు, బాలరాజుయాదవ్, రవి, విక్రమ్, దిలీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ముంపు బాధితులకు మెరుగైన పరిహారం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని గణపసముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులకు మెరుగైన పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని మండల కాంగ్రెస్ నాయకులు ఆగారం ప్రకాష్, కాంగ్రెస్ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రవినాయక్, ప్రభాకర్‌రెడ్డి, వాస నాగేశ్వర్ అన్నారు. పరిహారం విషయంలో శనివారం మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ ఆదివారం ఖిల్లాఘనపురం గంగమ్మ ఆలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపసముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులకు రాష్ట్రంలో ఇతర రిజర్వాయర్ల ముంపులో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చే పరిహారం కంటే మెరుగైన పరిహారం ఇచ్చేందుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు కేవలం రూ.5 నుంచి రూ.7 లక్షల వరకు మాత్రమే పరిహారం ఇస్తామని చెప్పిన నాయకులు రూ.12 లక్షలు ఇస్తామని చెప్పారని మాట్లాడటం తగదన్నారు. తప్పుడు మాటలు చెప్పడంతో రైతుల గందరగోళ పరిస్థితిలో పడతారని వారు తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ చెరువులో 250 ఎకరాల్లో నీరు నిలిచేలా చేసి తూముల ద్వారా రెండు పంటలకు నీరు వదిలేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గోండ్ల శంకర్, లచ్చిరెడ్డి, చెన్నయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు సహకరించండి



మాట్లాడుతున్న ఉద్యమకారులు

ఆత్మకూర్: పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు హాశం, రాజ్‌కిరణ్, యూసూఫ్, కురుమూర్తి కోరారు. ఆదివారం వారు స్థానికులతో సమావేశమై.. రాష్ట్రం సిద్ధించి దశాబ్దకాలం అవుతున్నా విగ్రహం ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాత కరెంట్ ఆఫీస్ వద్ద విగ్రహం ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నామని పార్టీలకు అతీతంగా చేయూతనివ్వాలని కోరారు. దాతలు ముందుకొచ్చి సహకారం అందించాలని త్వరలోనే విగ్రహం ఏర్పాటు చేస్తామని వివరించారు.

డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి

వనపర్తి టౌన్: వనపర్తి జిల్లా డాక్యుమెంట్ రైటర్స్ అధ్యక్షుడు సంధ్య రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రాగివేణుగోపాల్‌ను ఆదివారం రాత్రి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ కార్యవర్గం కలిసికట్టుగా సమిష్టి నిర్ణయాలతో ముందుకు వెళ్లాలని సూచించారు. వనపర్తి పేరు ప్రతిష్టలను నిలబెట్టడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధి అన్వర్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, ఫిషరీష్ చైర్మన్ నందిమల్ల యాదయ్య, నాయకులు నాగరాజు, అబ్దుల్లా, విజయ్, సందీప్, వెంకటేష్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



వనపర్తి: జిల్లా కేంద్రంలోని రావూస్ జూనియర్ కళాశాల 2001–03 బ్యాచ్ ఇంటర్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అలాగే, వివిధ రంగాల్లో స్థిరపడ్డ మిత్రులు ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకొని నాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు.

'స్వచ్ఛ' కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి



కార్మికులకు ఆరోగ్య కిట్లును పంపిణి చేస్తున్న చైర్మన్ కేశవ్

గద్వాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న స్వచ్ఛత కార్మికుల సంక్షేమంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు తమ కౌన్సిల్ కృషిచేస్తుందని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సుమారు 300 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిట్లు పంపిణీ చేశారు. వారం రోజులుగా జిల్లా కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు జయశ్రీ, శ్రీమన్నారాయణ, నాగరాజు, మహేష్, నాయకులు కోటేష్, ఇసాక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు పోరాడుదాం



మాట్లాడుతున్న ఐద్వా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

గద్వాల అర్బన్: మహిళా హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఐద్వా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో ఐద్వా సంఘం జిల్లా 2వ మహాసభలను నిర్వహించారు. ఈ సభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఐద్వా జెండాను ఆవిష్కరించారు. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, లక్ష్మీదేవి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని విమర్శించారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, ఇప్పటికే మహిళలపై లైగింక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సినిమాలు, బెల్ట్‌షాపులు, డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలతో పాటు మానవ సంబంధాలు దెబ్బతినడమే కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద, నాయకురాలు పద్మ, జయలక్ష్మి, రాధ, పావని, శివమ్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో 26 అంగుళాల హృదయ పటాన్ని చిత్రీకరించి విద్యార్థులతో మానవ హారం ఏర్పాటు చేశారు. మానవ శరీరంలో గుండెకు ఉన్న ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ ఎక్కువగా ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు.